# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-06-2024** **సమయం : 1.20 గంటలు**

## ముఖ్యాంశాలు

1. **భారత ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.**
2. **ప్రధానమంత్రి అధ్యక్షతన ఈ రోజు సాయంత్రం కేంద్ర మంత్రివర్గం తొలిసారిగా సమావేశం అవుతుంది.**
3. **చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పీహెచ్ రామకృష్ణ తెలిపారు.**
4. **భారత స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ జయంతి ఈ రోజు.**
5. **రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో రాగల రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.**

===========================

భారత ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రధానమంత్రి కిసాన్ నిధి విడుదలపై తొలిసంతకం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ,రైతుల సంక్షేమం కోసం తొలి సంతకాన్ని చేశానని, దీంతో 9.3 కోట్లమంది రైతులకు 20వేల కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. రాబోయే కాలంలో రైతులకు, వ్యవసాయ రంగానికి తోడ్పాటును అందిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

--------------------------

ప్రమాణ స్వీకారం అనంతరం ఈ రోజు సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం తొలిసారిగా సమావేశం కానుందుని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసంలో మంత్రివర్గం సమావేశం అవుతుందని, అనంతరం మంత్రులకు శాఖల కేటాయింపు ఉండే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పీహెచ్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాంతాల వారీగా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.అలాగే విజయవాడ నగరంలో

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నేరాల నియంత్రణకు సాంకేతిక విశ్లేషణ విభాగం ఏర్పాటు చేసామని తెలిపారు. జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాలపై నిఘా ఏర్పాటు చేసి, వాటి నిరోధానికి ప్రత్యేకంగా కార్య ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఎన్టీఆర్ జిల్లాలో కాలానుగుణమైన వ్యాధులను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. సుహాసిని ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో ఇప్పటికే చేపట్టాల్సిన చర్యల గురించి వైద్యాధికారులకు సదస్సు నిర్వహించామన్నారు. దోమకాటు వ్యాధుల నియంత్రణతో పాటు, కలుషిత నీటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశామని తెలిపారు. మంచినీటి సరఫరా ట్యాంకులను తరచూ తనిఖీలు చేసి, వాటిని శుభ్రపరుస్తున్నారా లేదా అనే విషయాలను అధికారులు పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు,

---------------------------

తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేసిన పార్లమెంట్ సభ్యులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సామాజిక వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం నుంచి మంత్రి వర్గంలో స్థానం పొందిన రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కు అభినందనలు తెలియజేశారు. విభజన చట్టం అమలు, కేంద్రం నుంచి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధుల విడుదలకు కృషి చేయాలని కోరారు. ప్రాజెక్టుల సాధనకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

---------------------------

నూతన విద్యా విధానంలో నాణ్యమైన బోధన, అభ్యాసం, విద్యార్థుల సంపూర్ణ వికాసం కోసం కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా–పీఎం శ్రీ పథకం కింద విజయనగరం జిల్లాలో 11, పార్వతీపురం మన్యంలో 5 పాఠశాలలను ఎంపిక చేశారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పీఎం శ్రీ కింద లబ్ధి పొందడానికి ఉమ్మడి జిల్లాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా ఉమ్మడి జిల్లాల నుండి 16 పాఠశాలలు కేంద్రం ఎంపిక చేసిందని చెప్పారు. ఇందులో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో అధునాతన ప్రయోగశాలలు, స్మార్ట్ తరగతులు, గ్రంథాలయాలు, క్రీడా పరికరాలు వంటివి ఏర్పాటు చేస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రభుత్వం అందించే బస్సు పాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైయస్సార్ జిల్లా ప్రజా రవాణాధికారి పి. గోపాల్‌రెడ్డి తెలిపారు. నిన్న ఆయన కడపలో మాట్లాడుతూ, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఆర్టీసీ బస్సు పాసులను రెన్యూవల్ చేస్తున్నామన్నారు. జిల్లాలోని బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప, పులివెందుల డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత రాయితీ బస్సు పాసులను అందించేందుకు బస్సు పాసుల రెన్యూవల్ కౌంటర్లను ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసే నియమ నిబంధనల ప్రకారం కొత్త దరఖాస్తులను త్వరలో జారీ చేస్తామని తెలిపారు.

---------------------------

తిరుపతి జిల్లా తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు ఈనెల 17 నుండి 21వ తేదీ

వరకు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం– టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. ఐదు రోజుల పాటు జరిగే తెప్పోత్సవాల్లో పద్మసరోవరంలో తెప్పలపై విహరించి అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాల్లో శ్రీ  అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమపూజలు అందుకుని భక్తులను అనుగ్రహించనున్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహించడం  టిటిడి ఆనవాయితీగా నిర్వహిస్తోంది.

--------------------------

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో నెల్లూరుకు జాతీయ ఖ్యాతి తెచ్చిన మహిళామణి  పొణకా కనకమ్మ జయంతి ఈ రోజు. పొణకా కనకమ్మ 1882 జూన్ 10న శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పోట్లపూడి గ్రామంలో కొండారెడ్డి, రావమ్మ దంపతులకు జన్మించారు. ఆమెకు పొణకా సుబ్బరామిరెడ్డితో వివాహం జరిగింది. బాపూజీ సత్యా, అహింసాయుధాల పట్ల ఆకర్షితురాలైన  కనకమ్మ వివిధ ఉద్యమాలలో పాల్గొని జైలుకు వెళ్లారు.  1913లో పోట్లపూడిలో సుజన రంజనీ సమాజ స్థాపన, వివేకానంద గ్రంథాలయం, బాలబాలికల విద్య కోసం జాతీయ పాఠశాలను ఏర్పాటు చేశారు.  1921 ఫిబ్రవరి 7న పల్లెపాడులో సత్యాగ్రహ ఆశ్రమాన్ని మహాత్మాగాంధీతో ప్రారంభింపజేశారు. 1930లో పల్లెపాడులో జరిగిన ఉప్పు సత్యాగ్రహం కార్యక్రమంలో కనకమ్మ ప్రముఖ పాత్రవహించి, అరెస్టు చేయబడి నెల్లూరు, వేలూరులో జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యం కోసం శ్రమించిన పొణకా కనకమ్మ 1963 సెప్టెంబర్ 15న కన్నుమూశారు. మహిళా జాతికి వెలుగుచుక్కయిన కనకమ్మ జ్ఞాపకార్థం 2021 మార్చి 8న తపాలాశాఖ ప్రత్యేక కవరును ముద్రించి గౌరవించింది.

--------------------------

తెలుగు రాష్ట్రాల్లోని అమ్రాబాద్, నాగార్జునసాగర్ పులుల సంరక్షణ ప్రాంతాల్లో ఏక వినియోగ ప్లాస్టిక్‌పై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అటవీ శాఖలు నిర్ణయించాయి. నిన్న ఇరు రాష్ట్రాల అటవీశాఖల సంయుక్త సమావేశం తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటలో జరిగింది. అటవీ సరిహద్దు సమస్యలు, రక్షణకు సంబంధించిన అంశాలపై ఇరు రాష్ట్రాల అధికారులు చర్చించారు. ప్లాస్టిక్ నిషేధంతో నీళ్ల బాటిళ్ల తరలింపుపై ప్రభావం పడనున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అటవీ సంరక్షణ ప్రధానాధికారులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని నాగార్జునసాగర్ పులుల సంరక్షణ ప్రాంతంతో పాటుగా, హైదరాబాద్–శ్రీశైలం మార్గంలో అమ్రాబాద్  పులుల సంరక్షణ ప్రాంతం పరిధిలోనూ ప్లాస్టిక్‌పై నిషేధం అమలులో ఉంటుందన్నారు.  ప్లాస్టిక్ నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

--------------------------

ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటల సాగుకు చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా తెలిపారు. రైతులకు  ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు.  జిల్లాలో ఖరీఫ్‌లో 2.50 లక్షల ఎకరాల్లో వరి, మినుము, పెసర, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేయనున్నారని,  ఇప్పటికే విత్తనాలను రైతులకు రాయితీపై పంపిణీ చేశామని తెలిపారు.  రైతులు దగ్గరలోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి.. వారికి కావాల్సిన విత్తనాల కోసం నమోదు చేయించుకోవాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు తదితరాలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే వాటిని తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

--------------------------

జమ్మూ కాశ్మీర్‌లో నిన్న జరిగిన ఉగ్రవాదుల దాడి కారణంగా బస్సు లోయలో పడిపోయిన దుర్ఘటనలో 9 మంది యాత్రికులు మరణించారని అధికారులు తెలిపారు. రియాసి జిల్లాలోని శివ కోడి గుహాలయం నుంచి కాత్రాకు ఈ బస్సు తిరిగి వస్తుండగా తేరియాత్ గ్రామం వద్ద ఉగ్రవాదులు బస్సుపై కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. తుపాకీ గాయం కావడంతో డ్రైవర్ బస్సు పై అదుపు కోల్పోవడంతో బస్సు లోయలో పడిందని, ఈ ఘటనలో 9 మంది మృతి చెందగా 33 మంది గాయపడ్డారని రియాసి జిల్లా ఎస్పీ మోహిత శర్మ తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. కేంద్ర మంత్రి అమిత్ షా ఈ దాడిని ఖండించారు. ఈ దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

---------------------------

జులై 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలులోకి రానున్న మూడు నూతన నేర న్యాయ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినీయం చట్టాలు ఆమోదయోగ్యమైనవని శ్రీ సత్య సాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన న్యాయవాది ఎస్.వి. నాగేంద్ర పేర్కొన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన నేర చట్టాల ద్వారా సరైన సమయంలో నిందితులకు శిక్ష పడేలా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాలను తీసుకొచ్చిందని ఆకాశవాణికి తెలుపుతూ,

వాయిస్ (39 సెకన్లు )

---------------------------

భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారా తక్కువ ఖర్చుతో రైతులు పంటలను సాగుచేయవచ్చని కృష్ణా జిల్లా ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం అధికారి డాక్టర్ పి.శ్రీలత తెలిపారు. భూసారాన్ని తరుచూ తెలుసుకోవడం ద్వారా ఎరువుల వాడకంలో అనవసరపు ఖర్చులు చేయకుండా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక, సుస్థిర దిగుబడులు పొందవచ్చని చెప్పారు. రైతులు తమ పొలంలోని మట్టిని వర్షాధార భూములలో 3 సంవత్సరాలకు ఒకసారి, నీటి వసతి క్రింద 3 పంటల కొకసారి పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 32 సెకన్లు...

======================